بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ     نَحْمَدُهٗ وَنُصَلِّی عَلٰی رَسُوْلِهِ الْكَرِيْمِ     وَعَلٰی عَبْدِهِ الْمَسِيْحِ الْمَوْعُوْدِ

# Summary of Friday Sermon Huzur-e-Anwar 26.09.2014 (Telugu)

**మస్జిదులు మోసము, పీడనమును కాక అల్లాహ్, అతని ప్రాణుల హక్కులు చెల్లించు స్థలములు. అన్ని కాలపు మానవుల కొరకు తన పోషణను చూపిన సర్వలోకాల సంరక్షకుడైన అల్లాహ్‌ను ఆరాధించుటకు ఈ మస్జిదులు నిర్మించబడును.**

*హజ్రత్ అమీరుల్ ముమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ 26.09.2014 తేదీన మస్జిద్ మర్యమ్ - ఐర్లాండ్ లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము*

తషహ్హుద్, తఅవ్వుజ్, తస్మియ, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ ఈ క్రింది సూక్తిని పఠించిరి.

اِنَّمَا يَعْمُرُ مَسٰجِدَ اللّٰهِ مَنْ اٰمَنَ بِاللّٰهِ وَالْيَوْمِ الْاٰخِرِ وَاَقَامَ الصَّلٰوةَ وَاٰتَى الزَّكٰوةَ وَلَمْ يَخْشَ اِلَّا اللّٰهَ فَعَسٰٓى اُولٰٓئِكَ اَنْ يَّكُوْنُوْا مِنَ الْمُهْتَدِيْنَ

(అత్తౌబహ్:18) ఈ సూక్తి అనువాదమిట్లు గలదు.

"అల్లాహ్‌ను, పరలోక దినమును విశ్వసించి, ప్రార్థనలు నమాజ్ సలుపుచు, దానములు జకాత్ చయుచు, అల్లాహ్‌కు తప్ప ఎవనితో భయపడని వాడే అల్లాహ్ మస్జిదులలో చేరుటకు అర్హుడు, వీరు తొందరలో మార్గదర్శనము పొందిన వారిలో పరిగణింపబడుదురు".

ఐర్లాండ్‌లో అహ్మదియ్య ముస్లిం సంఘపు మొదటి మస్జిదులో జుమా చదువు అల్లాహ్ మనకు అనుగ్రహము కల్పించుచున్నాడు. అల్‌హందులిల్లాహ్. ఈ మస్జిదు నిర్మాణము, దాని స్థాపన అన్ని విధాలా శుభప్రదము చేయుగాక! (ఆమీన్) ఇది చిన్న మస్జిదు అయినప్పటికి ముహమ్మదీయ మసీహ్‌ను విశ్వసించేవారు ఇక్కడి నుండి ఐదు పూటలు దైవ ఏకత్వమును ప్రకటింతురనుటకు ఇదొక సూచన. ఇందులో హాజరై ఏకైక దేవుడిని ఆరాధింతురు. ఈ మస్జిదు నుండి ఇట్లు పిలుపునిత్తురు. మస్జిదులు మోసము, పీడనమును కాక అల్లాహ్, అతని ప్రాణుల హక్కులు చెల్లించు స్థలములు. అన్ని కాలపు మానవుల కొరకు తన పోషణను చూపిన సర్వలోకాల సంరక్షకుడైన అల్లాహ్‌ను ఆరాధించుటకు ఈ మస్జిదులు నిర్మించబడును. గతములో కూడ ప్రతి జాతి ఇహ, పరలోక ప్రగతి కొరకు తన సంరక్షణను చూపెను. నేడు తన సంరక్షణ ద్వారా ప్రపంచమునకు లబ్ది కల్గించుచున్నాడు. ముమ్ముందు కూడ సదా లబ్ది కల్గించును, అనుగ్రహించుచుండును. అతని పోషణ ఏ ఒక్క జాతికి ప్రత్యేకించినది కాక సర్వ ప్రపంచము, ప్రాణులకు చెందినది. కనుక ఈ విధముగా ముహమ్మదీయ మసీహ్‌ను విశ్వసించే వారి మస్జిదులు ఇట్లు ప్రకటించును. ఆధ్యాత్మిక పోషణ పొందగోరినచో ముహమ్మదీయ మసీహ్ సంఘములో చేరువారికే ఇది సరైన రీతిలో లభించును. మేము ప్రపంచ పీడనమును దూరము చేయుటకు ప్రేమానురాగము, శాంతి, సంధితో కూడిన ఇస్లాం అందమైన బోధనను పరిశీలించుము. ప్రపంచమునకు యుద్ధము, ఖడ్గము, ఫిరంగులు

అవసరము లేదు, ప్రేమానురాగము, సోదరభావము అవసరమని ఈ మస్జిదులు ప్రకటించును. ఈ మస్జిదులో ప్రవేశించు ప్రతి ఒక్కరి హృదయము ప్రతి హింస, హక్కుల ఉల్లంఘన ఆలోచనలతో ప్రవిత్రమైనదని మనము నిర్మించుచున్న మస్జిదు ప్రకటించును.

ఇతరుల హక్కులు చెల్లించుటకు ప్రతి త్యాగము చేయుటకు, ఆ హక్కులు చెల్లించుటకు త్యాగము చేయుటకు స్వపక్షం వారి కొరకు దయామయ భావాలు కలిగి వుండుటయే కాక శత్రువుతో కూడ న్యాయముగా వ్యవహరింతురని మన ఈ మస్జిదు సూచించును. ధార్మిక స్వాతంత్ర్యమునకు అతిపెద్ద సంకేతము ఇస్లాం అని మనము నిర్మించుచున్న ఈ మస్జిదులు ప్రకటించును. దీనిని తెలుపుటకు మన మస్జిదుల ద్వారములు ప్రతి ఒక్కరి కొరకు తెరిచియున్నవి. ముస్లిం అయినను కాకున్నను ఏకైక దేవుడిని ఆరాధించే ప్రతి ఒక్కడు ఈ మస్జిదులో నిస్సంకోచముగా ప్రార్థించవచ్చును. పవిత్ర ఖురాన్ బోధనానుసారము సర్వ ధర్మముల ఆరాధానాలయాలను రక్షించుట ప్రతి నిజమైన ముస్లిం కర్తవ్యము, బాధ్యత. ఈ బాధ్యతను నిర్వర్తించుట తమ మస్జిదులను రక్షించినట్లేనని మన మస్జిదులు, దీనిలో వచ్చే ప్రతి అహ్మదీయుడు ప్రకటించును.

దేశముతో విశ్వాసపాత్రముగా వ్యవహరించుట కూడ విశ్వాసములో భాగమని మా మస్జిదులు మనకు గుర్తు చేయును. తన దేశము, జాతికి విశ్వాసపాత్రునిగా వుండనంత వరకు ఒకడు నిజమైన విశ్వాసుడు కాలేడు. మస్జిదులతో నిజమైన రీతిలో సంబంధము పెట్టుకున్న వారితో అల్లాహ్, అతని ప్రాణుల హక్కులు సక్రమంగా చెల్లించినప్పుడే మస్జిదుల హక్కు చెల్లించినట్లని మస్జిదులు నిర్దేశించును. అల్లాహ్ పవిత్ర ఖుర్ఆన్‌లో ఈ ఆజ్ఞలన్నిటిని మనకిచ్చెను. ఈ విషయములన్నిటిని చేయాలని మన యజమాని, విధేయతార్హుడు హజ్రత్ ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం పదే పదే సూచించిరి. తన ఆచరణ, ఉత్తమ ఆదర్శముతో అల్లాహ్, మానవుల హక్కులు అందించిరి. మానవ విలువలను స్థాపించుటకు, శాంతి స్థాపనకు వారు సల్లల్లాహు అలైహి వసల్లం తన ఆదర్శమును నెలకొల్పిరి.

ఇవి మాటలే కాదు, చరిత్ర కూడ సాక్ష్యముగా నున్నది. ఒక సందర్భమున క్రైస్తవులకు వారి ప్రార్థన సమయము ఆసన్నమైనప్పుడు మస్జిద్ నబ్వీలో ప్రార్థించుటకు అనుమతిచిరి. ఇదే నిజమైన ఇస్లాం బోధన. దీనినే ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం నిజమైన దాసుడు, ప్రేమికుడు తమపై విధించునొకుటకు ఆజ్ఞాపించిరి. నేను ప్రవేశపెట్టిన పలు ఉదాహరణలే నిజమైన ఇస్లాం బోధన, ఆచరణ. వీటిని అనుసరించు, వ్యాపింపజేయుటకు మనతో ఆశించుచు వర్తమాన ఇమామ్ మసీహ్ మౌవూద్, మహ్దీ మాహూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. ఈ ఆలోచనతో మీరెక్కడ మస్జిదు నిర్మించినా ఇస్లాం పరిచయముతో పాటు ప్రచార నూతన మార్గములు తెరుచుకొనును. ఇస్లాం వైపు ప్రజల దృష్టి కల్గును. దాని అందమైన బోధన వారిని ఆకట్టుకొనును. ఇటుల మీ సంఖ్య కూడ పెరుగును. ఈ ఉద్ధేశముతోనే మనము మన మస్జిదులు నిర్మింతుము, నిర్మించవలెను. ఈ బోధనను మీడియా ద్వారా చూసి, తెలుసుకొని ప్రపంచముకు మన వైపు దృష్టి కల్గుతుంది. సాధారణ వ్యక్తి నుండి పెద్ద పెద్ద నాయకులు, రాజకీయ వేత్తలు కూడ ఇట్లు గమనించుచున్నారు. ఒక వైపు కఠినత్వము కోరు పక్షము విధ్వంసము సృష్టించుచు, ఎటువంటి తేడా లేకుండా హత్యాకాండకు పాల్పడుచున్నది. మరో వైపు ఒక పక్షము ప్రేమానురాగము, సంధి, శాంతి కొరకు కృషి చేయుచున్నది. ఒక వైపు నామమాత్రపు ముస్లిముల మస్జిదుల నుండి దూషణలు, తిట్లు వెలువడును, దుష్టత్వముతో కూడిన భావాలు వెలువడును. మరో వైపు కేవలము ప్రేమ, శాంతి, సంధిని మాట్లాడబడును. ప్రేమించు అందరిని, ద్వేషించకు ఎవ్వరిని అను నినాదములు వెలువడును.

నిశ్చయముగా ఈ విషయములు తన వైపు దృష్టిని ఆకర్షించును.

ఈ రెండు రకముల ముస్లిములలో ఎందుకు భేదము గలదని ప్రజలకు కుతూహలం ఏర్పడును. అహ్మదియ్య సంఘము గురించి నూతన మీడియా, ఇంటర్నెట్ మొదలగు సాధనాల ద్వారా మరింత సమాచారము తెలుసుకొనుటకు ఈ కుతూహలం కారణమగును. దైవికముగా మొన్న డబ్లిన్ లోక్‌సభకు వెళ్ళినాను. కొందరు లోక్‌సభ సభ్యులతో కలిసే అవకాశము లభించెను. వారిలో ఒకడిట్లనెను. మానవ విలువలను ఏర్పరచుటకు, శాంతి స్థాపనకు అహ్మదియ్య సంఘము ఏ విధముగా కృషి చేయుచున్నదో ఆ విషయము ఇతర ముస్లిములలో కనిపించదు. నేను చాలా పరిశీలించి ఈ విషయములు తెలుసుకున్నాను. ఈ విషయములు తెలుసుకొన్న తర్వాత అహ్మదియ్య సంఘము డబ్లిన్‌లో కూడ త్వరగా మస్జిద్ నిర్మించవలెను, తద్వారా నా నగరమైన డబ్లిన్‌లో కూడ ప్రేమ, గొప్ప విలువలు వ్యాపించవలెనని నాకు కోరిక కలిగినది.

మస్జిదు నిర్మించే వారి విశిష్టతలు నేను ఆరంభములో పఠించిన సూక్తిలో గలవు. ఈ సూక్తి విస్తృత స్థాయి ఖానా కాబా నుండి వెలువడి ఈ విశిష్టతలు గల వారి ద్వారా జనావాసము కల్గిన ప్రతి మస్జిదుకు వ్యాపించును. వీరు విశ్వసించువారు. ఈ విశ్వాసుల విశిష్టతలను అల్లాహ్ తెలిపెను. ఒక చోట ఇట్లనెను. اشد حبا للہ అనగా విశ్వాసులు అందరి కంటే ఎక్కువ అల్లాహ్‌ను ప్రేమింతురు. ఏ ఇతర ప్రాపంచిక ప్రేమ వారిని ఆవహించదు. వారు అల్లాహ్ ప్రేమను పొందుటకు జీవితములు గడుపేందుకు కృషి చేయుదురు. ప్రాపంచిక లబ్ధి కొరకు అల్లాహ్‌ను విస్మరించలేరు. అల్లాహ్ ప్రేమ, అతని ఆజ్ఞలను పాటించుటకు ఉపకరించును. అల్లాహ్ ప్రేమ అతని ఆరాధనను కోరును.

> హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఒక చోట ఇట్లనిరి. "అల్లాహ్ ఉత్సాహము తన స్వంత ప్రేమలో మరే విశ్వాసుని భాగస్వామ్యమును భరించదు. ప్రేమలో మరెవరిని చేర్చనప్పుడే మనకు అతి ప్రియమైన విశ్వాసము సురక్షితముగా నుండును".

కనుక ఇది చాలా ఆలోచించదగిన విషయము. ఈ ప్రమాణమును ప్రతి ఒక్కరు పరిశీలించుకోవలెను. ఆత్మ పరిశీలనే మనకు మన స్థితిని తెలుపును. పవిత్ర ఖుర్‌ఆన్ అనేక ఆదేశములిచ్చెను. వాటి గురించి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఒక చోట ఇట్లు వ్రాసిరి. ఏడు వందల ఆజ్ఞలు గలవు. వీటిని నమ్మని వాడు, వీటిని ఆచరించుటకు కృషి చేయనివాడు నా నుండి దూరమగును, బంధమును తెంచుకొనును.

అల్లాహ్ ఆదేశములను పాటించినప్పుడే మన విశ్వాసము పూర్తి అగును. వీరు విశ్వాసమును కేవలము ప్రకటించరు. వీరి పట్ల అల్లాహ్ సహాయ, సహాకారములు అనుక్షణం కనిపించును. వారి ప్రతి అడుగు మార్గదర్శనపు క్రొత్త, క్రొత్త మార్గముపై పడును. ప్రతి మార్గము సఫల, విజయపు తులుపులు తెరుచును. ఈ మార్గదర్శనము వారిని విజయముల వైపు తీసుకెళ్ళును. వారికి విజయములు లభించును. కేవలము విశ్వాసమును మాత్రమే ప్రకటించక అల్లాహ్ ప్రేమ పొందు ఉద్దేశమే వారి దృష్టిలో వుండు విశ్వాసులు అహ్మదియ్య సంఘమునకు లభించుట అల్లాహ్ ఉపకారము. సామూహికంగా సంఘము ప్రగతి సాధించుటకు ఇదే రహస్యము గలదు. మస్జిద్ తర్వాత అహ్మదియ్య ప్రచారము అనగా నిజమైన ఇస్లాం పరిచయమునకు నూతన మార్గములు తెరుచుకొనును. తెరుచుకొంటున్నవి. వివిధ సందర్భములలో మనకు ఇదే అనుభవము కల్గినది. నేను చెప్పినట్లు మీ ప్రచారము వ్యాపించును. ధార్మిక, విద్యాపరమైన ప్రశ్నలకు సమాధానాలు చెప్పుటకు ప్రతి అహ్మదీ విద్యాపరంగా సిద్ధముగా నుండవలెను. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఆశించిన ప్రమాణము ప్రకారము మన

ఆచరణ వుండవలెను. ఆ ప్రమాణము ఎట్టిదో నేను ముందే తెలిపినాను. నేను చెప్పినట్లు పవిత్ర ఖుర్ఆన్ అన్ని ఆజ్ఞలను పాటించుటయే ఆ ప్రమాణము. ఇక్కడి నివాసులు తమంతట తామే మీ వైపు ఆకర్షితులయ్యే విధముగా తమ ఆదర్శములను నెలకొల్పుము.

ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం విధేయతలో మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అవతరించి మమ్ములను అల్లాహ్‌తో కలిపిరి. ఇదే ఇస్లాం సజీవ ధర్మమునకు నిదర్శనము. ఆ అల్లాహ్ ప్రార్థనలను విని, ఆమోదించును. తన వాగ్దానము మేరకు సంకేతములను ప్రదర్శించును. కనుక ఈ మసీహ్ మౌవూద్‌ను నమ్ముటలోనే ప్రపంచ జీవితము గలదు. ఈ మసీహ్ మౌవూద్ నీడన చేరితేనే అల్లాహ్‌తో సజీవ సంబంధము ఏర్పడును. మనము ఈ విషయములను నిస్సంకోచముగా అనగలమా ? లేదా అనుటకు ఆలోచించవలసి వచ్చునా ? ఒకడు ప్రార్థన ఆమోదపు సవాలు విసిరినచో నేను స్వీకరించగలనా ? నాకు అల్లాహ్‌తో సంబంధము గలదా ? నేను అల్లాహ్ భయము, ప్రేమను నా హృదయములో కలిగి వుండి అల్లాహ్ ఆజ్ఞల అనుసారము నా జీవితము గడుపుటకు కృషి చేయుచున్నానా ? లేనిచో ఒక అహ్మదీయుని స్థితిలో నా బాధ్యతను విస్మరించుచు ప్రపంచాన్ని ఏ విధముగా ఆహ్వానించగలను. పవిత్ర మార్పులు సంభవించు ఆశతో నన్ను మసీహ్ మౌవూద్‌ను నమ్ముటకు పిలుచుచున్నావు! నీలో మసీహ్ ఏ మార్పు కల్గించినాడని నన్ను ప్రజలు ప్రశ్నించును. అల్లాహ్‌తో సంబంధము ఏర్పడునను ఆశతో నన్ను మసీహ్ మౌవూద్‌ను నమ్ముటకు పిలుచుచున్నావు! నీకు అల్లాహ్‌తోనే మేరకు సంబంధము ఏర్పడినది. మీరు చెప్పిన విధముగా మసీహ్ మౌవూద్‌ను నమ్మిన మీ ప్రతి కర్మ పవిత్ర ఖుర్ఆన్ ప్రకారముండవలెను. మీరున్నట్లే, మేమున్నాము. మీలో, మాలో ఏమి భేదము గలదు ? అహ్మదీయుడు ఒక అహ్మదీగా గుర్తించబడు ప్రతి చోట అతని బాధ్యతలు మరింత పెరుగును. అతడు అహ్మదీ కాదు, మసీహ్ మౌవూద్ ప్రతినిధి అగును. అందుకే మా పక్షమై మమ్ములను అపనిందకు గురిచేయకుమని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తెలిపిరి.

కనుక ఒక అహ్మదీయుని దుష్కార్యము అతని వ్యక్తిత్వము వరకే పరిమితము కాదు. అది హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వరకు చేరును. ప్రతి అహ్మదీ గుర్తించవలసిన ముఖ్యమైన విషయమిది. ఇదంతా దృష్టిలో వున్నప్పుడు ప్రతి అహ్మదీయుడు అహ్మదియ్య సంఘపు ప్రతినిధి అగును. ప్రతి పరిచయము అతనికి ప్రపంచ దృష్టిలో మరింత గౌరవము కలిగించుచు అది మీ వైపు పరుగెత్తును. మీరు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ప్రతినిధి అగుదురు. ప్రచార హక్కులను చెల్లించు వారగుదురు. ప్రపంచవాసుల ఇహ,పరలోకమును చక్కదిద్దు వారగుదురు. అల్లాహ్ శుభములను పొందువారగుదురు. కనుక దీనిని పొందుటకు మనము అత్యంత కృషి చేయవలెను. తమ ఐదు పూటల నమాజులను నిర్ణీత సమయములో భక్తి శ్రద్ధలతో సలుపే, మస్జిదు హక్కు చెల్లించవలసిన అవసరము గలదు. ఫరాఇజ్‌తో పాటు నవాఫిల్‌తో కూడ అల్లాహ్‌తో బంధమును ఏర్పరచుకోవలెను. దాసుల హక్కులు చెల్లించే అవసరము ఎంతో గలదు. ప్రతి అహ్మదీ స్త్రీ, పురుషుడు తన బాధ్యతను గుర్తించు అవసరము గలదు.

వీరు మర్యమ్‌ను ఎంతో గౌరవింతురు, కనుక మేము ఈ మస్జిద్ పేరు మర్యమ్ అని పెట్టినామని గర్వముగా ఇక్కడి నివాసులకు మనము చెప్పుకొందుము. హజ్రత్ మర్యమ్ ఈసా తల్లి అయినందుకు వీరికి ప్రియమైన వారు. కాని హజ్రత్ ఈసా తల్లితో పాటు ఆమె సద్గుములను, సత్కార్య ప్రమాణమును అల్లాహ్ గుర్తించి ఆమెను ఆదరించి, మీరు మర్యమ్ వలె కావలెనని అల్లాహ్ చెప్పినందుకు ఆమె మాకు ప్రియమైనవారు.

అల్లాహ్‌తో ప్రేమ, భయము వలన మర్యమ్ తన శీలతను రక్షించుకొనిరి. వారు అల్లాహ్ సంపూర్ణ విధేయురాలు, అతని ఆజ్ఞలను పాటించువారు. వారు సన్మార్గురాలు, సత్యవంతురాలై యుండిరి. అల్లాహ్ ప్రతి విశ్వాస స్త్రీ, పురుషునికి ఈ విశ్వాస లక్షణములను అవలంభించుటకు ఆజ్ఞాపించెను. ఇక్కడి నివాసులు మర్యమ్‌ను కేవలం గౌరవించి, వారి సద్గుణములను అలవర్చుకొననిచో ఇది వారి బలహీనత అని నేను అహ్మదీ స్త్రీ, బాలికలతో అందును. ఒక నిజమైన ముస్లిం స్త్రీ, పరుషుడు హజ్రత్ మర్యమ్ వలె అల్లాహ్ నిజమైన విధేయత వహించుచు అల్లాహ్ ఆజ్ఞలన్నిటిని పాటించవలెను.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం మనకు ఉపదేశమందించుచు ఒక చోట ఇట్లనిరి.

"అదృష్టవంతుల కొరకు అల్లాహ్ ఈ శుభకార్యమును నెలకొల్పెనని నేను సత్యాసత్యముగా తెలుపుచున్నాను. దీనితో ప్రయోజనము పొందే వారే శుభముగలవారు. పొందవలసిన దంతయు మీరు పొందినారని ఈ విషయములో మీరు గర్వ పడకూడదు. తమ గట్టి నిరాకరణ, అవమానముతో అల్లాహ్‌ను అసంతృప్తి పరచిన వారి కంటే మీరు అదృష్టవంతులని అనుట నిజమే. సదాలోచనతో వ్యవహరించి అల్లాహ్ ప్రకోపనము నుండి మోక్షము పొందినారను విషయము కూడ నిజమైనదే. శాశ్వత జీవితము కొరకు అల్లాహ్ సృష్టించిన చెలిమ వద్దకు మీరు వచ్చినారను విషయము కూడ వాస్తవమే. కాని ఇంకా నీరు త్రాగవలసి యున్నది. మిమ్ములను పుష్టిగా త్రాగించుటకు అల్లాహ్‌తో ప్రార్థన చేయుము. అల్లాహ్ ఉపకారము లేనిదే ఏమి జరగదు. అల్లాహ్‌యే అనుగ్రహించును. ఈ నీరు జీవితమును ప్రసాదించును, నాశనము నుండి రక్షించును, షైతాన్ దాడుల నుండి కాపాడును. కనుక ఈ  చెలిమతో త్రాగిన వాడు నాశనము కాడని నాకు గట్టిగా నమ్మకము గలదు. ఈ చెలిమ నుండి పుష్టిగా త్రాగటకు ఏ మార్గము గలదు ? అదేనమగా అల్లాహ్ మీపై విధించిన రెండు హక్కులను గుర్తించి వాటిని సంపూర్ణ రీతిలో నిర్వర్తించుము. వీటిలో ఒక్కటి అల్లాహ్ హక్కు గలదు. రెండవది అల్లాహ్ ప్రాణుల హక్కు గలదు".

ఈ హక్కు చెల్లించు అనుగ్రహము అల్లాహ్ సదా కల్పించు గాక! ఈ చెలిమ నుండి అధికాధికముగా మనము శుభము పొందువారమగుదుము గాక! అనంతరం ఈ శుభముతో ప్రపంచానికి కూడ ప్రయోజనము కల్గించువారమగుదము  గాక!

ఈ మస్జిదు పలు వివరములు కూడ తెలిపెదను. కొందరికి ఈ విషయముల పట్ల ఆసక్తి వుండును. క్రీ.శ. 2010 సెప్టెంబర్‌లో దీనికి నేను శంకుస్థాపన చేసితిని. 2400 చదరపు మీటర్లు అనగా సుమారు ముప్పావు ఎకరం భూమి గలదు. 217 చదరపు మీటర్ల పైకప్పుతో మస్జిద్ నిర్మించిబడినది. ఈ భూమి క్రీ.శ. 2009లో ఐదు లక్షల పదిహేను వేల యూరోలు వెచ్చించి కొనుగోలు చేయబడినది. ఇందులో నిర్మించబడి యున్న ఒక గృహము కూడ యుండెను. అనంతరం దీని నిర్మాణములో 11 లక్షల యూరోలు ఖర్చు చేయబడినవి. ప్రధాన హాలు, ఇతర గదులను కలిపి 200 మంది నామజు చేయగలరు. రెండు కార్యాలయములు కూడ ఈ మస్జిదుతో కలిసి వున్నవి. ఒక గృహము కూడ యుండెనని నేనింతకు ముందే తెలిపిని. ఇందులో మూడు గదులు, ఒక వంట గది గలవు. 17 వాహనములు పార్కింగ్ చేయగల ప్రాంగణము గలదు. ఈ స్థలము మంచి ప్రాంతములో గలదు.

దీని సమీపములోనే గుర్రాల పందెంనకు మైదానము యున్నది. అక్కడి నుండి ఈ మస్జిద్ చాలా అందముగా కనిపించును. గుర్రాల పందెంలో పాల్గొనుటకు ప్రఖ్యాత వ్యక్తులు ఇక్కడికి వత్తురు. అక్కడి నుండి మస్జిద్ కూడ ఎంతో మంచిగా కనిపించును. అందులో ఇక్కడి నివాసులు సుమారు 40 వేల మంది పాల్గొందురు. బయటి నుండి ప్రజలు ఇక్కడికి వచ్చుచున్నందుకు మస్జిద్ పరిచయము కూడ పెరుగును. ఇది పెద్ద జనావాసము గల ప్రాంతము. ఇక్కడి నుండి వందలాది మంది రోజు వెళ్ళుచుందురు. విధ్యార్థుల ఒక నివాస గృహము కూడ ఇక్కిడికి సమీపములోనే గలదు. గాల్వే విమానాశ్రయము కూడ ఇక్కడి నుండి పది నిమిషముల దూరములోనే గలదు. అనంతరం దీని గోడకు అనుకొని వెనుక వైపు రుండు గృహములు కూడ కొనుగోలు చేయబడినవి. అవి కూడ నివాసమునకు మంచి స్థితిలో గలవు. ఈ మొత్తం భవనసముదాయములో అల్లాహ్ శుభము కల్గించు గాక! ఇక్కడ నివసించే వారికి మస్జిద్ హక్కు చెల్లించే అనుగ్రహము ప్రసాదించుగాక! (ఆమీన్)

✪✪✪✪✪
✪✪✪

*Summary: Majlis Ansarullah Bharat, Translation:Hafiz Syed Rasool Niyaz, (Telugu Desk)*

Published by: Nazarath Nashr-O-Isha'ath, e-mail:telugudesk@yahoo.in
P.O.:Qadian, Dist:Gurdaspur, Pin:143516, Punjab, Mob 84376 99866

BOOK POST (PRINTED MATTER)

*To,*

..........................................................................................

..........................................................................................